నియామకం సరే.. జీతమేదీ?

- తీవ్ర నిరాశలో నర్సింగ్ ఆఫీసర్లు
- ఫిబ్రవరిలోనే ఉద్యోగాల్లో చేరిక
- రెండు నెలలుగా అందని వేతనాలు
- శాపంగా మారిన అధికారుల నిర్లక్ష్యం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): 'మేం ఎల్బీ స్టేడియంలో డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం చేసినప్పుడు మా కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారు. ఇప్పుడు నర్సింగ్ అభ్యర్థులు నియామక పత్రాలు పొందుతూ మా కుటుంబ సభ్యులుగా మారిన వారి ముఖాల్లో సంతోషం చూడాలనే ఉద్దేశంతో ఎల్బీ స్టేడియంలో కార్యక్రమం ఏర్పాటు చేశాం'.. ఈ ఏడాది జనవరి 31న నర్సింగ్ ఆఫీసర్లు/స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు ఇచ్చే కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. అంతవరకు బాగానే ఉన్నా నర్సింగ్ ఆఫీసర్లకు ఆ తర్వాతే కష్టాలు మొదలయ్యాయి. మొదటి జీతం తీసుకున్నామన్న సంతోషం వారికి ఇప్పటికీ దక్కలేదు. రెండు నెలలుగా జీతాల కోసం వారు కండ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. వైద్యారోగ్యశాఖలో మొత్తం 6,956 మంది నర్సింగ్ ఆఫీసర్లకు జనవరి 31న ఎల్బీస్టేడియంలో అట్టహాసంగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎంతోపాటు డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఇతర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్, ప్రభుత్వ సలహాదారులు హాజరయ్యారు. మొత్తం 9 విభాగాల్లో నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు ఫిబ్రవరి మొదటి వారం నుంచి తమకు కేటాయించిన పోస్టుల్లో చేరారు. పీహెచ్‌సీలు మొదలు ఉస్మానియా, గాంధీ వంటి సూపర్‌స్పెషాలిటీ దవాఖానల వరకు దాదాపు రెండు నెలలుగా సేవలు అందిస్తున్నారు. అయినప్పటికీ వారికి వేతనాలు అందడం లేదు. ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రతి నెల దాదాపు రూ.50 వేల జీతం అందుతుందని నాడు ఎల్బీ స్టేడియంలో ఊదరగొట్టారు. వారి కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ.35 కోట్ల అదనపు భారం మోస్తుందని చెప్పుకొచ్చారు. అభ్యర్థులతో చప్పట్లు కొట్టించుకున్నారు. ఉద్యోగులకు కూడా ఆ సంబరమే మిగిలింది. ఉద్యోగం వచ్చిందన్న సంతోషమే తప్ప జీతం తీసుకున్నామన్న సంతోషం వారికి లేకుండా పోయింది. ప్రతి నెల 1న ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ, నర్సింగ్ ఉద్యోగులు మాత్రం వేతనాల కోసం ఉగాది రోజున కూడా వేచి చూడాల్సి వచ్చింది.

అధికారుల నిర్లక్ష్యమే శాపం

సాధారణంగా కొత్తగా నియమితులైన నర్సింగ్ సిబ్బంది నియామక ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (డీపీహెచ్) కార్యాలయం పర్యవేక్షించాల్సి ఉంటుంది. నియామక పత్రాలు అందుకున్న తర్వాత అభ్యర్థులు సంబంధిత దవాఖాన సూపరింటెండెంట్, డీఎంహెచ్‌వోలను కలిసి వాటిని అందజేస్తారు. తర్వాత సంబంధిత దవాఖాన లేదా డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది వారికి సర్వీస్ నిబంధనల ప్రకారం ఎంప్లాయీ ఐడీ, బ్యాంక్ అకౌంట్ తదితర నియామక ప్రక్రియను పూర్తిచేసి వివరాలను డీపీహెచ్ కార్యాలయానికి పంపుతారు. వివరాలు అక్కడి నుంచి నర్సింగ్ విభాగానికి చేరుతాయి. అప్పటి నుంచి వారికి ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు లభిస్తుంది. రెండు నెలలు గడుస్తున్నా ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, కిందిస్థాయి అధికారుల అవినీతి కారణంగానే జాప్యం జరుగుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు నెలల తర్వాత కూడా కొన్ని చోట్ల ఇంకా క్లర్కుల స్థాయిలోనే వీరి ఫైళ్లు ఆగిపోయాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. డీపీహెచ్ కార్యాలయంలో ఈ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 'ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తర్వాత జీతం అందడానికి రెండుమూడు నెలలు పట్టడం కామన్' అంటూ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని, పైగా 'మీరు ఉద్యోగంలో చేరిన మొదటి రోజు నుంచి లెక్కపెట్టి వేతనం ఒకేసారి వస్తుంది. రెండుమూడు నెలలు ఆలస్యం అయితే ఏమవుతుంది?' అని దబాయిస్తున్నట్టు కొందరు అభ్యర్థులు వాపోతున్నారు. అసలే రెండు నెలలుగా వేతనం అందక ఉద్యోగులు ఇబ్బంది పడుతుంటే, కొన్నిచోట్ల కిందిస్థాయి సిబ్బంది 'ప్రతిఫలం' అందితేనే ఫైల్ కదులుతుందని డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు వెంటనే వేతనాలు అందేలా చూడాలని నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించొద్దు

ప్రభుత్వానికి ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, మాస్టార్జీ వినతి

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 11: దళితుల అభ్యున్నతి, సామాజిక వికాసం, ఆర్థికంగా వారు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం కేటాయించే ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా వారి సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని దళిత క్రిస్టియన్ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షుడు మాస్టార్జీ ప్రభుత్వాన్ని కోరారు. ప్రపంచంలోని దళితులు సకల రంగాల్లో వికాసం కోసం జై భీమ్ గ్లోబల్ కమ్యూనిటీ నెట్‌వర్క్ యాప్‌ను గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో వారు ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 20 వరకు సబ్‌ప్లాన్ విధి విధానాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ చదివే దళిత విద్యార్థులు వ్యాస రచనలు రాసి 9912043013 నంబర్‌కు వాట్సాప్ పంపించాలని పేర్కొన్నారు. సమావేశంలో యాప్ వ్యవస్థాపకుడు రమేశ్, మిక్కి రాష్ట్ర అధ్యక్షుడు విప్లవ్‌గాంధీ, న్యాయవాది ప్రవీణ్‌కుమార్, అరుంధతీయ బంధు సేవామండలి నగర ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, సహాయ కార్యదర్శి జేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిడతల రాకను పసిగట్టే పీ-లాకోస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ): పంటలకు నష్టం చేసే మిడతల రాకను ముందుగానే పసిగట్టే ప్రత్యేకమైన పరికరాన్ని వ్యవసాయ పరిశోధన సంస్థ ఇక్రిశాట్ అభివృద్ధి చేసింది. పర్యావరణంలో కలిగే మార్పుల వలన వృద్ధి చెందే మిడతల సంతతిని, వాటి రాకను పసిగట్టి, వాటిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలను తీసుకునే ప్రోటోకాల్‌కు శాస్త్రవేత్తలు రూపకల్పన చేశారు. మిడతలు అత్యంత వేగంగా తమ సంతతిని వృద్ధి చేసుకుని పంట పొలాలపై మూకుమ్మడిగా దాడి చేస్తాయని తెలిపారు. వాటి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు పీ-లాకోస్ట్ అనే టూల్ సాయపడుతుందని చెప్పారు. పెరిగే ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో హెచ్చు తగ్గుదల మిడతల సంతతి వేగంగా పెరిగేందుకు సహకరిస్తున్నట్టు గుర్తించారు. మారుతున్న ఉష్ణోగ్రతలు, మిడతల సంతతిని ముందుగానే గుర్తించే సెన్సార్లతో పనిచేసే ఈ పీ-లాకోస్ట్ పరికరం రైతులకు ఎంతగానో సహకరిస్తుందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు ఆధారంగా పనిచేసే ఈ పరికరాన్ని ఆఫ్రికా ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు ఉండే ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా పరిశీలించారు.

సందేశ్‌ఖాలీ బాధితుల కోసం ఈ-మెయిల్

నిర్భయంగా ఫిర్యాదులు పంపాలని కోరిన సీబీఐ

కోల్‌కతా, ఏప్రిల్ 11: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీ బాధితుల కోసం సీబీఐ ఒక ఈ-మెయిల్‌ను రూపొందించింది. సందేశ్‌ఖాలీలో కొందరు నేతల ఆధ్వర్యంలో మహిళలపై దౌర్జన్యాలు, భూ ఆక్రమణలు భారీగా జరిగినట్టు ఆరోపణలు రావడంతో దానిపై సీబీఐ విచారణ జరపాలంటూ కలకత్తా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో కోర్టు అనుమతితో సీబీఐ గురువారం ఈ మెయిల్ చిరునామాను ప్రకటించింది. సందేశ్‌ఖాలీ బాధితులు తమ ఫిర్యాదులను sandeshkhali@cbi.gov.inకు ఈ-మెయిల్ చేయవచ్చునని వెల్లడించింది. ఈ ఈ-మెయిల్ గురించి పత్రికలలో ప్రకటించడంతో పాటు స్థానికంగా విస్తృతంగా ప్రచారం చేయాలంటూ నార్త్ 24 పరగణాల జిల్లా మేజిస్ట్రేట్‌ను హైకోర్టు ఆదేశించింది. బాధితులు నిర్భయంగా తమ ఫిర్యాదులను పంపాలని సీబీఐ కోరింది.

సీఏఏ, ఎన్ఆర్సీ, యూసీసీని అనుమతించేది లేదు

తేల్చిచెప్పిన బెంగాల్ సీఎం

కోల్‌కతా, ఏప్రిల్ 11: దేశ పౌరులను ఇబ్బందులకు గురిచేసేలా కేంద్రం తెచ్చిన చట్టాలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి మండిపడ్డారు. తమ రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ), సీఏఏలను ఎట్టిపరిస్థితుల్లో అమలు చేయనివ్వనని హామీనిచ్చారు. వీటిని బలవంతంగా అమలు చేసేందుకు తాము అంగీకరించబోమని అన్నారు. ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ..దర్యాప్తు సంస్థల ద్వారా ప్రజలను, విపక్షాలను భయపెట్టడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. వివిధ మతాలకు చెందిన వారి మధ్య సోదరభావం వెల్లివిరుస్తుండటం వల్లే ప్రజలు శాంతంగా జీవిస్తున్నారన్నారు. తాను బతికున్నంత వరకు మీకెలాంటి హాని కలగనీయనని బెనర్జీ హామీ ఇచ్చారు.

సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం

నిత్యావసరాల కొనుగోళ్లపై మార్గదర్శకాలు

- 'నమస్తే'లో 'కొమురవెల్లి టెండర్లలో గోల్‌మాల్'కు స్పందన
- ప్రముఖ ఆలయాల నిర్వహణపై రాష్ట్ర దేవాదాయ శాఖ సమీక్ష
- సరుకుల కొనుగోలు, నిల్వలపై కమిషనర్‌కు వివరాలు అందజేత
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ఆన్‌లైన్ టెండర్లు నిలిపివేత

నమస్తే ఎఫెక్ట్

చేర్యాల, ఏప్రిల్ 11: రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో నిత్యావసర సరుకుల కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నట్టు దేవాదాయ శాఖ అధికారులు గుర్తించారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నిత్యావసర సరుకుల కొనుగోలు, టెండర్లలో అక్రమాలు జరుగుతుండటంపై 8-4-2024 (సోమవారం)న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి దేవాదాయ శాఖ స్పందించింది. ఈ మేరకు కొండగట్టు ఆంజనేయస్వామి, బాసర జ్ఞానసరస్వతి, కొమురవెల్లి మల్లన్న, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయాల ఈవోలతో రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయాల్లో ఇప్పటివరకు జరిగిన కొనుగోలు టెండర్లు, నిత్యావసర సరుకుల పంపిణీ అంశాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆలయాల స్టోర్ రూమ్‌లలో ఉన్న స్టాక్ వివరాలను సేకరించారు. ఆయా ఆలయాల ఈవోలు.. స్టాక్, కొనుగోలు, చెల్లింపులు తదితర వాటిపై నివేదికలను కమిషనర్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో జరుగుతున్న నిత్యావసర సరుకుల కొనుగోళ్ల కోసం టెండర్లలో నూతన విధానం తీసుకొచ్చేందుకు ఆయా ఆలయాల డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్ల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సంబంధించి 2024-25 నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం నిర్వహించిన టెండర్లను దేవాదాయ శాఖ కమిషనర్ ఖరారు చేయలేదు. నూతన విధానం అమలులోకి వచ్చిన అనంతరం అదే టెండర్లను ఖరారు చేయాలా? తిరిగి టెండర్లు నిర్వహించాలా? అనే దానిపై రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకోనున్నారు.

ప్రతిరోజూ రూ.5 కోట్లు లూటీ

- రాష్ట్రం నుంచే ఏటా రూ.1800 కోట్లు
- రోజుకొక ఎత్తుగడతో సైబర్ నేరాలు
- ఫ్రాడ్స్‌లో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ టాప్
- ప్రజలు ఈజీ మనీకి అలవాటు పడొద్దు
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ప్రజలు ఈజీ మనీకి ఎక్కువగా ఆశపడుతుండటంతో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. రోజుకొక కొత్త ఎత్తుగడతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒక్క తెలంగాణ నుంచే రోజుకు రూ.5 కోట్ల చొప్పున ఏడాదికి సుమారు రూ.1,800 కోట్ల డబ్బును.. కర్ర విరగకుండా, చుక్క రక్తం చిందకుండా దోచేస్తున్నారు. ఈ ఏడాది మూడు నెలల్లో నమోదైన టాప్-5 సైబర్ నేరాల్లో బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ టాప్‌లో ఉన్నది. ప్రస్తుతం బెట్టింగ్‌లకు వ్యసనరులైన వారిని గుర్తించి.. వారికి ఈజీమనీని పరిచయం చేసి, అక్కడ బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపు మళ్లిస్తున్నట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తెలిపారు. రూ.వెయ్యి నుంచి పెట్టుబడి పెట్టించి రూ. లక్షలు, కోట్లలో మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. తర్వాతి స్థానాల్లో ఓటీపీ ఫ్రాడ్స్, అడ్వర్టైజ్‌మెంట్ ఫ్రాడ్స్ (ఓఎల్ఎక్స్), ఫెడ్ఎక్స్ కొరియర్ సర్వీసెస్, సెక్స్‌టార్షన్ వంటివి టాప్-5 నేరాల్లో ఉన్నట్టు వెల్లడించారు. గతంలో విపరీతంగా పెరిగిన సెక్స్‌టార్షన్ మోసాలు.. ప్రస్తుతం తెలంగాణలో తగ్గుముఖం పట్టినట్టు తెలిపారు. సాంకేతిక వినియోగం అధికంగా ఉన్న తెలంగాణలోనే ఈ తరహా భారీ లూటీ జరుగుతుండటం ఆందోళనకరమని, పరిస్థితి ఇంత దారుణంగా ఉండటానికి ప్రధాన కారణం ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన లేకపోవడమేనని తెలిపారు. ఈజీ మనీ వైపు అడుగులు వేయొద్దని సూచించారు.



జస్టిస్ రామలింగేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ పుల్లా కార్తీక్

జస్టిస్ రామలింగేశ్వర్‌రావుకు కన్నీటి వీడ్కోలు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఏ రామలింగేశ్వర్‌రావు అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. ఆయన జర్మనీలో ఉంటున్న కూతురిని చూసేందుకు ఇటీవల వెళ్లగా, గుండెపోటుతో అక్కడే కన్నుమూశారు. ఏపీ ప్రభుత్వం చొరవతో ఆయన భౌతికకాయాన్ని జర్మనీ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. గురువారం న్యాయమూర్తులు జస్టిస్ తుకారాంజీ, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ శ్రీనివాస్‌రావు, జస్టిస్ లక్ష్మీనారాయణ, మాజీ అడిషనల్ సొలిసిటర్ జనరల్ సూర్యకరణ్‌రెడ్డి, మాజీ ఏజీ బీఎస్ ప్రసాద్ తదితరులు రామలింగేశ్వర్‌రావు పార్థివదేహానికి నివాళులర్పించారు. పలువురు న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు ఆయన మృతికి సంతాపం తెలిపారు. అనంతరం మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవుల రక్షణ, చెంచుల హక్కుల కోసం రామలింగేశ్వర్‌రావు న్యాయవాదిగా వాదించిన 'సమత' కేసుగా దేశమంతా ప్రసిద్ధి చెందింది.

బీసీఏ, బీబీఏ కాలేజీల్లో మనది ఆరోస్థానం

- 158 కాలేజీలతో దేశంలోనే తెలంగాణ టాప్-6
- మొత్తం 3,271.. 694 కాలేజీలతో కర్ణాటక టాప్
- తొలిసారిగా అనుమతులు జారీచేసిన ఏఐసీటీఈ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): బీసీఏ, బీబీఏ, బీఎంఎస్ కాలేజీలు ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉన్నది. 158 కాలేజీలతో దేశంలోనే మన రాష్ట్రం ఆరోస్థానంలో నిలిచింది. విస్తీర్ణం, జనాభాపరంగా మనకన్నా పెద్దవైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్ వంటి రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలోనే ఈ కాలేజీలు అధికంగా ఉండటం విశేషం. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ), బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ), బ్యాచిలర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (బీఎంఎస్) కోర్సుల నిర్వహణకు 2024-25 విద్యా సంవత్సరంలో జాతీయంగా 3,271 కాలేజీలకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇటీవలే అనుమతులు మంజూరు చేసింది. ఇది వరకు ఆయా రాష్ట్రాల్లోని వర్సిటీలే పైకోర్సులకు అనుమతులు ఇచ్చేది. తొలిసారిగా ఈ అనుమతులు ఏఐసీటీఈ గొడుగు కిందికి చేరాయి.

- అత్యధికంగా 694 కాలేజీలతో కర్ణాటక మొదటిస్థానంలో నిలిచింది. ఆ తర్వాత మహారాష్ట్రలో(467), కేరళ (309) కాలేజీలతో అగ్రస్థానంలో ఉన్నాయి.
- 183 కాలేజీలతో మధ్యప్రదేశ్ నాలుగో స్థానం, 159 కాలేజీలతో పంజాబ్ ఐదో స్థానంలో నిలిచాయి.
- 158 కాలేజీలతో తెలంగాణ ఆరోస్థానం, 153 కాలేజీలతో గుజరాత్ ఏడో స్థానంలో ఉన్నాయి.
- 153 కాలేజీలతో బీహార్, హరియాణా, 152 కాలేజీలతో ఉత్తరప్రదేశ్, 114 కాలేజీలతో తమిళనాడు టాప్-10 రాష్ట్రాల జాబితాలో నిలిచాయి.
- దేశంలో పైపది రాష్ట్రాల్లోనే 100కు పైగా కాలేజీలు ఉండగా, మిగతా రాష్ట్రాల్లో 100లోపు కాలేజీలు మాత్రమే ఉన్నాయి.

వారంరోజుల్లో ఏకీకృత కరికులం

బీసీఏ, బీబీఏ, బీహెచ్ఎం కోర్సులకు జాతీయంగా అనుమతులు ఇస్తుండటంతో ఏఐసీటీఈ ఏకీకృత కరికులాన్ని రూపొందించింది. బీటెక్ తరహాలో వివిధ సంస్థలు, పరిశ్రమల నిపుణులను సంప్రదించి, మాడల్ పాఠ్యాంశాలను రూపొందించారు. వారంరోజుల్లోగా ఈ కరిక్యులాన్ని విడుదల చేస్తారు. అందరి నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత అవసరమైన మార్పులు చేస్తారు. దీంతోపాటు ఈ కోర్సులు బోధించే లెక్చరర్లు, ఆచార్యులకు శిక్షణ ఇచ్చేందుకు ఏఐసీటీఈ సన్నాహాలు చేస్తున్నది. కొత్తగా విడుదల చేయనున్న కామన్ కరికులంపై వారికి శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులను ఏఐసీటీఈ పరిధిలోకి తీసుకురావడంతో బీసీఏ ఉత్తీర్ణులైన వారికి ఎంసీఏ, బీబీఏ వారికి ఎంబీఏ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామలను ప్రారంభించేందుకు అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులు మన దగ్గర నిర్వహించే ఐసెట్ వంటి ప్రవేశపరీక్షలతో నిమిత్తం లేకుండా నేరుగా ఈ కోర్సుల్లో చేరే వెసులుబాటు దక్కుతుంది.

ఆర్ట్ టీచర్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీకి మరోసారి నియామక పరీక్ష నిర్వహించాలని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ట్రిబ్)ను హైకోర్టు ఆదేశించింది. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్ష పేపర్ ఇవ్వాలని స్పష్టం చేసింది. ఆర్ట్ టీచర్ పోస్టుల భర్తీకి నిరుడు ఏప్రిల్‌లో జారీ చేసిన ట్రిబ్ నోటిఫికేషన్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నది. ఆగస్టు 1న నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షల్లో ఇంగ్లిష్ మీడియం పేపర్ మాత్రమే ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా పరీక్ష నిర్వహించడం నిబంధనలను ఉల్లంఘించడం అవుతుందని చెప్పారు. పరీక్షకు తెలుగు మీడియం అభ్యర్థులు వేలల్లో హాజరయ్యారని, వారికోసం తెలుగులోనూ పరీక్ష నిర్వహించాలని కోరారు. ట్రిబ్ పరిధిలో ఇంగ్లిష్ మీడియంలోనే బోధన జరుగుతున్నదని, అందుకే ఇంగ్లిష్ పేపర్ సరిపోతుందని స్టాండింగ్ కౌన్సిల్ రమేశ్ ప్రస్తావించారు. వాదనలు విన్న అనంతరం తిరిగి పరీక్ష నిర్వహించాలని ధర్మాసనం తీర్పునిచ్చింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా తెలుగులోనూ పేపర్ ఇవ్వాలని ఆదేశించింది.

అక్షరాస్యత వృద్ధికి కొత్త పథకం

- రాష్ట్రవ్యాప్తంగా న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రామ్
- జూన్ రెండోవారం నుంచి పూర్తిస్థాయిలో అమలు
- కార్యక్రమ బాధ్యత జిల్లా విద్యాశాఖాధికారులకు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వయోజనుల్లో అక్షరాస్యతను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టబోతున్నది. న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ)ను అమలుచేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ వేసవి సెలవుల్లోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని భావించినా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వాయిదావేశారు. జూన్ రెండో వారం నుంచి ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేస్తారు. 15 ఏండ్లు నిండిన నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. నిరక్షరాస్యులు, డ్రాపౌట్లను వారి వయస్సు, విద్యార్హతలను బట్టి చదువుకునేలా ప్రోత్సహిస్తారు. ఓపెన్‌స్కూల్, దూరవిద్య ద్వారా వారి అభిరుచుల మేరకు అందుబాటులో ఉన్న కోర్సుల్లో చేర్పిస్తారు. గతంలో సాక్షరభారత్ పథకాన్ని అమలుచేశారు. ఈ పథకం కోసం వలంటీర్లను నియమించి కొంత పారితోషికం ఇచ్చేవారు. కానీ, ఇప్పుడు పారితోషికం ఇవ్వకుండా స్వచ్ఛందంగా పనిచేసే వలంటీర్ల సేవలను వినియోగించుకుంటారు. అంగన్‌వాడీ టీచర్లు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు, టీచర్లు, విద్యార్థులు, వలంటీర్ల సహాయాన్ని తీసుకుంటారు. ఎన్ఐఎల్‌పీ కార్యక్రమ అమలు బాధ్యతలను జిల్లా విద్యాశాఖాధికారులకు అప్పగించారు. జిల్లాస్థాయిలో డీఈవోలు, క్షేత్రస్థాయిలో విద్యాశాఖలో పనిచేసే టీచర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. ఉన్నత పాఠశాలలు కేంద్రంగా ఆయా పాఠశాల పరిధిలో అక్షరాస్యతా పెంపు కార్యక్రమాలను అమలుచేస్తారు. ఒక పాఠశాల హెచ్ఎం లిట్రసీ సూపర్‌వైజర్‌గా, ఇద్దరు టీచర్లల్లో ఒకరు లిట్రసీ టీచర్‌గా, మరొకరు సర్వేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఆయా టీచర్ల ఎంపికకు విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తికాగానే, ఎన్నికల కోడ్ ముగియగానే 'న్యూ ఇండియా లిట్రసీ ప్రోగ్రామ్'ను అమలుచేస్తారు.




RADHAVI ENTERTAINMENTS
SUPER HIT..
RELEASE BY DHEERAJ MOGILINENI ENTERTAINMENT
నేడే చూడండి
శ్రీరంగనీతులు
PRODUCER VENKATESHWAR RAO BALMURI WRITER & DIRECTOR PRAVEEN KUMAR VSS
AJAY ARASADA TILAK TOMY SASANK VUPPUTURI BACHU SUDHAKARAN SHREEMANI
KIRAN ANNAMANENI SATISH BALU SHESHADRI MUNTHA SHREEKAR KHAJANDAR MADURI MADHU
MOHANA SREE AKSHAY YADANAVENI CHANDU CS VINOD PERVELA LAXMIRAJ PIPAVATH
SONY MUSIC
PRASAD'S ప్రసాద్-ఎన్.టీ.ఆర్.గార్డెన్స్ 6.55PM
PVR ఆర్.క